# కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల జోలికొస్తే ఖబర్దార్

## డిగ్రీ కళాశాల భూముల పరిరక్షణ రౌండ్ టేబుల్ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు

## విద్యార్థి నాయకుల అరెస్టు





కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తులను కాపాడు కుందాం అనే అంశంపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించాల్సిన ఈ సమావేశాన్ని లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల పేరుతో నిలిపివేసి విద్యార్థి సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు పోలీసుల చర్యలను ఖండిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 1964లో ఏర్పడిన కాలేజీ ఎడ్యుకేషన్ సొసైటీకి రైతుల నుంచి 268 ఎకరాల భూమిని సేకరించి అప్పగించారు. రైతులు చెమటోడ్చి రక్తపు బొట్టుతో కూడబెట్టిన ఆ భూములను కాపాడటంలో సొసైటీ సభ్యులు విఫలమయ్యారని ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ సభ్యులుగా ఉన్న సమయంలోనే భూములు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోలేదని, కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి సభ్యులుగా, ఆయన తండ్రి కె.వి. రాజిరెడ్డి సెక్రెటరీగా ఉన్న కాలంలోనే అనేక అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. అరోరా ఇంజనీరింగ్ కాలేజీకి 26 ఎకరాల భూమి అప్పగించడంలో ఎమ్మెల్యే రమణారెడ్డి కీలకపాత్ర వహించారని ఆరోపించారు. అరోరా యాజమాన్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పటివరకు ఒక పైసా అద్దె కూడా చెల్లించలేదని, పైగా కేసులు వేసి ఆ భూమి మాదేనని చెప్పడం దురదృష్టకరమని మండిపడ్డారు. అదే విధంగా శిశు మందిర్ పాఠశాలకు కూడా రెండు ఎకరాల భూమిని అక్రమంగా లీజు ఇచ్చారని, ఈ వ్యవహారాలన్నింటికీ అప్పటి సొసైటీ సభ్యుడిగా ఉన్న ఎమ్మెల్యే రమణారెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టార్జితమైన భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జా చేయనివ్వమని, కాలేజీ భూముల పేరుతో జరిగిన అవినీతిని ప్రజల ముందు బహిర్గతం చేస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు అని విద్యార్థి నాయకులు స్పష్టం చేశారు. కబ్జాకు గురైన ప్రతి ఎకరం భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అప్పగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. కామారెడ్డి, పరిసర గ్రామాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ భూములను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేయడమే అసలు లక్ష్యమని వెల్లడించారు. ఏ లక్ష్యంతో రైతులు భూములు ఇచ్చారో, ఆ లక్ష్యం నెరవేరే వరకు అందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి పోరాడుతామని, వెనుకడుగు వేయమని ప్రకటించారు. పోలీసుల ముందస్తు అరెస్టులతో సమావేశం నిలిచిపోయినా ఉద్యమ స్ఫూర్తి మాత్రం మరింత బలపడిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల స్వరం అణచివేయలేరని, ఇది కేవలం భూముల కోసం పోరాటం కాదు విద్యా హక్కు కోసం, భవిష్యత్ తరాల కోసం జరుగుతున్న ఉద్యమమని స్పష్టం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆజాద్, సందీప్ కుమార్, జీవియం విఠల్, అరుణ్, లక్ష్మణ్, నాగరాజు, భరత్, వినోద్, వినయ్, సోఫియన్, డేవిడ్, రాహుల్ తదితరులున్నారు.

# మున్సిపల్ కార్మికుల సీఐజీ గ్రూపులను కొనసాగించాలి

## టీయుసీఐ, సిఐటియూ, ఏఐటియుసి సంఘాల డిమాండ్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :మున్సిపల్ కార్మికుల సిఐజి గ్రూపులను కొనసాగించాలని, ఏజెన్సీ కార్మికులతో కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ టీయుసీఐ, ఏఐటియుసి, సిఐటియు సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య, సిఐటి యు జిల్లా ఉపాధ్యక్షులు ఏ.రమేష్ బాబు లు మాట్లాడుతూ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ కార్మికులతో ఇప్పటికే కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు (సిఐజి) ఉన్నాయన్నారు. ఇవి కాకుండా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలో 330 మంది కార్మికులు ఉన్నారని, ఇప్పటికే ఉన్న సిఐజి గ్రూపులను రద్దుచేసి కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలను కోవడం సరైంది కాదన్నారు. అందువల్ల పనిభారం పెరుగుతుందని, ఇప్పటికే ఉన్న సిఐజి గ్రూపులను కొనసాగిస్తూ, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ 330 మంది కార్మికులను 20 నుండి 25 మందితో ఒక గ్రూపుగా ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. అదే విధంగా ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ యూనిఫామ్, సబ్బులు, నూనెలు, రక్షణ పరికరాలు ఇవ్వాలని, కేటగిరీల వారీగా ఇతర మున్సిపల్ కార్పొరేషన్ లో ఇస్తున్నట్లు వేతనాలు చెల్లించాలని, పిఎఫ్ ఈఎస్ఐలలో ఉన్న తప్పులను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీయుసీఐ జిల్లా నాయకులు రాజేశ్వర్, కిరణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు సబ్సిడీ లోన్లను సద్వినియోగం చేసుకోవాలి



మోర్తాడ్, బతుకమ్మ :మహిళా సమాఖ్య లోని మహిళలు సబ్సిడీ లోన్లను సద్వినియోగ చేసుకొని ఆర్థికంగా ఎదగడానికి మంచి అవకాశం అని జిల్లా టీ ఎన్ జీ వో ఉపాధ్యక్షుడు బత్తుల మాణిక్యం అన్నారు. మోర్తాడ్ మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో గురువారం నిర్వహించిన పీఎంఎఫ్ఎంఈ స్పాట్ రిజిస్ట్రేషన్ డీపీఆర్ ఎంట్రీ కార్యక్రమంలో లోన్స్ పై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న రూ. లక్షకు 35% సబ్సిడీ వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో వినియోగించుకొని ఆదాయాభివృద్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపీయం రాజయ్య, జిల్లా ఏపియం రవి, మోర్తాడ్ ఎపియం గంగారెడ్డి, సీ సీ లు తడకల శ్రీనివాస్, మురళీ, మహేందర్, గాజుల శ్రీనివాస్, సరళ, రాధ, లక్ష్మి, లబ్దిదారులకు తదితరులు పాల్గొన్నారు.

### నీటి ఎద్దడి నివారణకు

## ముందస్తు చర్యలు చేపట్టండి


### ఎంపిడీఓ సంతోష్ కుమార్



భీమ్ గల్, బతుకమ్మ :రానున్నది వేసవి కాలం దృష్ట్యా నీటి ఎద్దడి నివారణకు అన్ని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సంతోష్ కుమార్ గ్రామ పంచాయతీ సెక్రటరీ లను ఆదేశించారు. గురువారం జీపీ సెక్రటరీల రివ్యూ మీటింగ్ ను నిర్వహించిన ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు ఇసుక వాహనం యాప్ ద్వారా ఇసుక ఇప్పించుటకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో 100% టాక్స్ కలెక్షన్ చేయాలని ఆదేశించారు. వ్యవసాయ పనులు తగ్గు ముఖం పట్టినందున ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనుల యొక్క వేగం పెంచాలని, కనీసం ప్రతి గ్రామంలో 100 మంది కూలీలు పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీల నిర్వహణ సక్రమంగా నిర్వహించి ప్రజలకు ఉపయోగపడే మొక్కలను పెంచాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ జావిద్ ఆలీ, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెలంగాణ తిరుమల దేవస్థానంలో వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు





బాన్సువాడ, బతుకమ్మ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు భక్తుల కోలాహలంతో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దేవనాథ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సతీమణి పుష్ప, కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవానికి ముందుగా నిర్వహించిన హోమ కార్యక్రమంలో పోచారం శ్రీనివాస రెడ్డి సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చారణల మధ్య సాగిన ఈ ఉత్సవం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. ఈ సందర్భంగా పోచారం కుటుంబ సభ్యులు పోచారం శంభు రెడ్డి, ప్రేమ దంపతులు, మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, సోని రెడ్డి దంపతులు, పోచారం సురేందర్ రెడ్డి ఆలయ కమీటీ సభ్యులు హాజరయ్యారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## మున్సిపల్ చైర్మన్ బొదిరే నాగమణి స్వామి



భీమ్ గల్, బతుకమ్మ :పట్టణ ప్రజలు తమ తమ ఇండ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భీమ్ గల్ మున్సిపల్ చైర్మన్ బొదిరే నాగమణి స్వామి కోరారు. గురువారం పట్టణంలోని 11 వ వార్డ్ లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండ్లల్లో నీళ్లు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నిల్వ ఉన్న నీళ్లను వారానికి ఒక్కసారి భాద్యతగా తొలగించాలన్నారు. తద్వారా దోమల నివారణ జరిగి రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చునన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని, ఈ స్పెషల్ సానిటేషన్ కార్యక్రమంలో భాగంగా మురికి కాలువల శుభ్రం చేయడం, స్ప్రేయింగ్ చేయడం,ఆయిల్ బాల్స్ వేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ సంటి లత నరయ్య., మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, డాక్టర్ అజయ్ పవర్, కౌన్సిలర్ సంగ్య నాయక్,సందీప్, తోట సతీష్, అంజుమ్, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఖ